సాక్షి సంగారెడ్డి

శనివారం । 1 । జూలై । 2023

I



అతి వేగమే కారణమా!

జాతీయ రహదారిపై వాహనాలు ఎక్కడ పడితే అక్కడ నిలపడం, అతివేగం వాహనదారుల ప్రాణాలమీదికొస్తోంది. రోడ్డు ప్రమాదానికి అతి వేగం, డీసీఎం నిలపడమే కారణమని భావిస్తున్నారు. IIలో



అమీన్‌పూర్‌లోనే పాలిటెక్నిక్ కళాశాల IIIలో

సీఎం కేసీఆర్ ఇటీవల ప్రకటించిన పాలిటెక్నిక్ కళాశాల అమీన్‌పూర్‌లోనే ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి వెల్లడించారు.

అందరికీ నెగెటివ్



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 13 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేయగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 11 మందికి చేసినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

గ్రూప్–4 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ డాక్టర్ శరత్



సంగారెడ్డి టౌన్: జూలై 1న నిర్వహించనున్న గ్రూప్–4 పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ శరత్ శుక్రవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 101 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 33,456 మంది పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్ష నిర్వహణకు 24 మంది రూట్ ఆఫీసర్లు, 24 మంది అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లు, 101 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 101 మంది లైజన్ అధికారులు, అవసరం మేరకు ఇన్విజిలేటర్‌లను నియమించినట్లు చెప్పారు. అభ్యర్థులు టీఎస్‌పీఎస్సీ నిబంధనలు పాటించాలన్నారు. పరీక్ష ప్రారంభం కావడానికి 15 నిమిషాల ముందే కేంద్రం గేట్లు మూసివేస్తారన్నారు. నిర్ణీత సమయానికి ముందే అభ్యర్థులు తమ పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. తనిఖీ చేసిన తర్వాతే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. భారీ సంఖ్యలో అభ్యర్థులు పరీక్ష రాస్తున్నందున ఈసారి వేలిముద్రను తప్పనిసరి చేశారని తెలిపారు.

ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపిక



జిన్నారం (పటాన్‌చెరు): మండలంలోని కిష్టాయిపల్లి గ్రామానికి చెందిన మాదారం భాస్కర్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి ఆధ్వర్యంలో సేవ చేసే వారిని గుర్తించి ఈ అవార్డులకు ఎంపిక చేస్తారని రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నయీం తెలిపారు. ఈనెల 5వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో భాస్కర్‌కు ఎక్సలెన్స్ అవార్డును అందించనున్నట్లు చెప్పారు.

నోటిఫికేషన్ విడుదల

కొండాపూర్(సంగారెడ్డి): 2019 నవంబర్‌లో వెలువడిన నోటిఫికేషన్ ఆధారంగా సమగ్ర శిక్ష, ఎమ్మార్సీలలో ఖాళీగా ఉన్న పోస్టులను పూర్తిగా కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించడానికి ఉత్తర్వులు వెలువడినట్లు డీఈఓ వేంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. సమగ్ర శిక్ష, ఎమ్మార్సీలలో ఎంఐఎస్ కోఆర్డినేటర్‌లు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు, సిస్టం అనలిస్టులు, అసిస్టెంట్ ప్రోగ్రామర్లు, ఐఈఆర్‌పీలకు 2019లో నోటిఫికేషన్ ఇచ్చి డిసెంబర్‌లో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారన్నారు. ఈ పరీక్షల్లో అర్హత పొందిన అభ్యర్థులకు ప్రస్తుతం సంగారెడ్డి జిల్లాలో గల ఖాళీలకు రోస్టర్, మెరిట్ ఆధారంగా పూర్తి కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించడం జరుగుతుందన్నారు. ఎమ్మార్సీలలో ఎంఐఎస్ కోఆర్డినేటర్‌లు 7, ఎమ్మార్సీ, సమగ్ర శిక్ష, డీపీఓ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు 5, సమగ్ర శిక్ష డీపీఓ కార్యాలయంలో అసిస్టెంట్ ప్రోగ్రామర్ ఒకటి, మండల స్థాయిల్లో ఐఈఆర్పీలు 27 ఖాళీగా ఉన్నాయన్నారు. జూలై 1వ తేదీన జిల్లాస్థాయి కమిటీ అనుమతితో అభ్యర్థుల రోస్టర్, కం మెరిట్ జాబితా, జూలై 3న విద్యాశాఖ కార్యాలయంలో, మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో అభ్యర్థుల సీనియారిటీ జాబితా అందుబాటులో ఉంచుతున్నారు. జూలై 4న అభ్యంతరాల స్వీకరణ, జూలై 5న అభ్యంతరాల పరిశీలన, జూలై 7న జిల్లా స్థాయి కమిటీ అనుమతితో అభ్యర్థుల తుది జాబితా తయారీ, అదే రోజు జాబితా నోటీసు బోర్డులో ప్రదర్శిస్తారు.

జూలై 10న ఎంపికైన అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన, అనంతరం నియామకం పత్రాలు జారీ చేస్తారని తెలిపారు. నియామక పత్రం పొందిన మూడు రోజుల్లో వారికి కేటాయించిన విధంగా జాయినయి 2024 ఏప్రిల్ 23 వరకు కాంట్రాక్ట్ అగ్రిమెంట్ సమర్పించాల్సి ఉంటుందన్నారు.

అడ్మిషన్ల ప్రారంభం

కొండాపూర్(సంగారెడ్డి): ఓపెన్ స్కూల్ విధానంలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్మీడియట్‌కు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు డీఈఓ వేంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. అడ్మిషన్ పొందేందుకు ఈ నెల 10వ తేదీ నుంచి ఆగస్టు 10 వరకు గడువు ఉందన్నారు. పదో తరగతికి ఓసీ పురుషులకు రూ.1400, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీలతో పాటు మహిళలకు రూ.1000, ప్రాస్పెక్టస్‌కు రూ.150, ఆన్‌లైన్ చార్జీలు అదనంగా చెల్లించాలన్నారు. అదేవిధంగా ఇంటర్మీడియట్‌కు ఓసీ పురుషులకు రూ.1500, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తో పాటు మహిళలకు రూ 1200, ప్రాస్పెక్టస్‌కు రూ.300తోపాటు ఆన్‌లైన్ చార్జీలు చెల్లించాలన్నారు. నిర్ణీత ఫీజు కంటే ఎక్కువ వసూలు చేస్తే ఆ అధ్యయన కేంద్రాన్ని రద్దు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడ్మిషన్‌లు తెలంగాణ సార్వత్రిక విద్యా పీఠం www.telanganaopenschool.org ద్వారా మాత్రమే నమోదు చేయాలని సూచించారు. మరిన్ని వివరాలు ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ వెంకటస్వామిని 8008403635 ఫోన్ చేసి తెలుసుకోవాలన్నారు.

పరిహారం ఇచ్చేదెప్పుడో?

మార్చి, ఏప్రిల్‌లో కురిసిన వడగళ్ల వర్షాలకు అపార పంట నష్టం



ఖానాపూర్‌లో నేలవాలిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జేడీఏ నర్సింహారావు (ఫైల్)

- జిల్లాలో 6,409 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తింపు
- ఎకరాకు రూ.10 వేల నష్ట పరిహారం ప్రకటించిన ప్రభుత్వం.. ఇప్పటికే ఇతర జిల్లాల్లో అందజేత

జహీరాబాద్: రెండు పర్యాయాలు కురిసిన అకాల వర్షాలకు యాసంగిలో సాగైన పంటలకు అపార నష్టం వాటిల్లింది. ఇది రైతులకు తీవ్ర నష్టాన్ని తెచ్చి పెట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీగా వడగళ్లు వాన కురియడమే కాకుండా బలమైన ఈదురు గాలులు వీయడంతో యాసంగి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మార్చిలో కురిసిన భారీ వడగళ్ల వానతో తీవ్ర నష్టం వాటిల్లడంతో ముఖ్యమంత్రి పలు జిల్లాల్లో పర్యటించి నష్టాన్ని స్వయంగా పరిశీలించారు. రైతులను ఆదుకునేందుకు ఎకరాకు రూ.10 వేల పరిహారం అందిస్తామని ప్రకటించారు. వెంటనే ఏ మేరకు నష్టం వాటిల్లిందో నివేదికలు పంపాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఇందుకు వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు క్షేత్ర పర్యటించి నష్టాన్ని గుర్తించి నివేదికలను ప్రభుత్వానికి అందించారు. నివేదికలు అందజేసి దాదాపు నాలుగు నెలలు కావస్తున్నా రైతులకు ఇప్పటి వరకు పరిహారం అందలేదు. ఇతర జిల్లాల్లో పరిహారం అందజేసిన ప్రభుత్వం తమ ఊసెత్తడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

రెండు పర్యాయాల్లో అకాల వర్షాలు

- మార్చి 16, 17 తేదీల్లో కురిసిన వడగళ్ల వానకు జిల్లాలో 4,047 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. వర్షాల కారణంగా 3,093 మంది రైతులు నష్టపోయినట్లు నిర్ధారించారు.
- ఏప్రిల్ 27 నుంచి 30వ తేదీ వరకు కురిసిన భారీ వడగళ్ల వర్షాలకు మిగిలి ఉన్న పంటలను కూడా మింగేసింది. పూర్తిగా యాసంగిలో ప్రధానంగా సాగు చేసిన మొక్కజొన్న, జొన్న, సోయాబీన్, తెల్లకుసుమ, శనగ పంటలతో పాటు బొప్పయి, అరటి, టమాట, ఉల్లిగడ్డ, గోబి, క్యాబేజీ, వంకాయ తదితర కూరగాయలు దెబ్బతిన్నాయి.
- మామిడి తోటలకు అపార నష్టం జరిగింది. ఆయా పంటల సాగు కోసం ఎకరాకు సుమారు రూ.20 నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. పంటలు దెబ్బతినడంతో రైతులు అప్పుల పాలయ్యారు.

ఏప్రిల్‌లో కురిసిన వర్షాలకు..

- ఏప్రిల్ 27 నుంచి 30వ తేదీ వరకు కురిసిన భారీ వర్షాలు జహీరాబాద్ ప్రాంతం పైనే అధికంగా ప్రభావం చూపింది. ఈ వర్షాలకు 2,362 ఎకరాల మేర పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు.
- ఇందులో కోహీర్, జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోనే అధికంగా నష్టం వాటిల్లింది. ఈ మూడు మండలాల్లోనే 1,426 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించారు.
- కోహీర్ మండలంలో 655 ఎకరాలు, జహీరాబాద్ మండలంలో 612 ఎకరాలు, మొగుడంపల్లి మండలంలో 159 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించారు.

6,409 ఎకరాల్లో పంట నష్టం

- జిల్లాలో రెండు పర్యాయాలు కురిసిన అకాల వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా 6,409 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. మార్చిలో కురిసిన వర్షాలకు 4,047 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించగా, ఏప్రిల్ నెల 27 నుంచి కురిసిన భారీ వడగళ్ల వర్షాలకు 2,362 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించారు.
- రెండు పర్యాయాలు కురిసిన భారీ వర్షాలు జహీరాబాద్ డివిజన్‌పైనే అత్యధిక ప్రభావం చూపాయి. అపార నష్టం కూడా ఈ నియోజకవర్గంలోనే జరిగింది.



పరిహారానికి సంబంధించిన సమాచారం లేదు



“ రెండు పర్యాయాలు జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు సంబంధించి జరిగిన పంట నష్టం గురించి ప్రభుత్వానికి నివేదికలు పంపాము. ఇప్పటికీ పరిహారానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేదు. త్వరలో సమాచారం వచ్చే అవకాశం ఉంది. పరిహారం మంజూరు కాగానే రైతుల ఖాతాల్లో జమచేస్తాం.

– నర్సింహారావు, జేడీఏ, సంగారెడ్డి

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మొక్కలు నాటాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మొక్కలు నాటాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. శుక్రవారం జిల్లా, మండల పరిషత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో మొక్కలు నాటాలన్నారు. కొత్త ప్రాంతాలను గుర్తించి హరితహారం లక్ష్యం పూర్తి చేయాలన్నారు. జిల్లాలో సొంత గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాలులేని గ్రామాల వివరాలు అందజేయాలన్నారు. జిల్లాలో వెనుకబడిన వర్గాల్లో కులవృత్తులు, చేతి వృత్తి దారులకు రూ.లక్ష ఆర్థిక సహాయానికి వచ్చిన దరఖాస్తుల్లో పారదర్శకత పాటించి, ఎంపిక చేయాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీఆర్‌ఓ నగేష్, డీపీఓ సురేశ్ మోహన్, పీడీ డీఆర్డీఏ శ్రీనివాస్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారిణి వసంతకుమారి, సివిల్ సప్లయ్ అధికారిణి వనజ, ఆయా శాఖల అధికారులు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యువ ఉత్సవ్

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. యువత ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో యువ ఉత్సవ్ నిర్వహిస్తోంది. భారతదేశం 2047 అనే థీమ్‌తో సృజనాత్మక రచన, కవిత్వం, చిత్రలేఖనం, మొబైల్ ఫొటోగ్రఫీ, ఉపన్యాసం, సాంస్కృతిక, జానపద కళలపై యువ ఉత్సవ్ పోటీలు నిర్వహించి బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి మాట్లాడుతూ యువతీ యువకులు తమ విజ్ఞానము, తెలివితేటలు తమ స్వార్థం కోసం కాకుండా కుటుంబం, సమాజం, దేశం కోసం వినియోగించాలన్నారు. అనంతరం ఉమ్మడి మెదక్ జిల్లా యువజన విభాగం అధికారి మూల రంజిత్ రెడ్డి మాటాడారు. యువ ఉత్సవ్ ఉద్దేశం భారత దేశం 2047లో ఏ విధంగా ఉండాలనే దానిపై ఈ కార్యక్రమలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో 33 బేటాలియన్ సుబేదార్ మేజర్ సురేంద్ర గురంగ్, ఉమ్మడి మెదక్ జిల్లా నెహ్రూ యువ కేంద్రం కార్యక్రమ అధికారి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపు

- శంకర్ సేవలు ఆదర్శం
- జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీశ్



శంకర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

వట్‌పల్లి(అందోల్): విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపు తెస్తాయని జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీశ్ అన్నారు. శుక్రవారం జోగిపేట బీసీ సంక్షేమ హాస్టల్లో పనిచేస్తున్న ఉద్యోగి శంకర్ పదవీ విరమణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసని, తాము చేసిన సేవలే గుర్తింపును తెస్తాయన్నారు. జిల్లాలో హాస్టల్ వెల్ఫేర్ తరఫున ఏ కార్యక్రమం చేసినా శంకర్ కీలకంగా వ్యవహరించే వారన్నారు. కుటుంబ సభ్యుల కోరిక మేరకు మళ్లీ అతడి సేవలను హాస్టల్లో వినియోగించుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్ర హెచ్‌డబ్ల్యూఎస్ అధ్యక్షుడు గౌస్ మాట్లాడుతూ తాను హాస్టల్ వార్డెన్‌గా పనిచేసినప్పుడు తన వద్ద శంకర్ పనిచేసిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం అతడిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కృష్ణ, లైన్స్ క్లబ్ జోన్ చైర్మన్ ఆకుల రాంబాబు, అందోల్ తాలూకా టీఎన్జీఓ సంఘం అధ్యక్షుడు మల్లికార్జున్, హాస్టల్ వార్డెన్ శోభారాణి, రాధిక, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వాణిజ్య బ్యాంకులతో సమానంగా సేవలు

పీజీవీబీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి



పటాన్ చెరు శాఖను ప్రారంభిస్తున్న ఏపీజీవీబీ

పటాన్‌చెరు టౌన్: కమర్షియల్ బ్యాంకులతో సమానంగా ఏపీజీవీబీ సేవలు అందిస్తోందని ఏపీజీవీబీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి అన్నారు. ఆధునీకరించిన ఏపీజీవీబీ పటాన్‌చెరు శాఖను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీజీవీబీ(ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంక్)లో అన్ని రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో రైతులకు, డ్వాక్రా మహిళలకు సేవలు అందించేవారమని ప్రస్తుతం గృహ రుణాలు నుంచి కమర్షియల్ బ్యాంక్ నిర్వహించే అన్ని రకాల సేవలు ఇందులో అందిస్తున్నామన్నారు. ఖాతాదారులకు చేరువయ్యేందుకు బ్రాంచ్‌ను ఆధునీకరించామని, డిజిటల్ సేవలు కూడా అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. తక్కువ వడ్డీకే గృహ రుణాలు ఇస్తున్నామన్నారు. ఈ అవకాశం సెప్టెంబర్ 30 వరకు నిర్వహించే క్యాంపులో అవకాశం కల్పించామన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఐసీ అండ్ ఆడిట్ జీఎం సుబ్రహ్మణ్యం, ఏజీఎం అండ్ రీజినల్ మేనేజర్ ఎస్ఎల్ఎన్ ప్రసాద్, పటాన్‌చెరు బ్రాంచ్ మేనేజర్ ఈవీఎస్ఎస్ మూర్తి, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆ స్కూల్‌ని సీజ్ చేయాలి

డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేశ్

కొండాపూర్(సంగారెడ్డి): పర్మిషన్ లేకుండా సీబీఎస్ఈ ఇంటర్నేషనల్ పేరుతో అడ్మిషన్లు ఇస్తున్న రావూస్ స్కూల్‌ను తక్షణమే సీజ్ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సంగారెడ్డి డీఈఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ విజయకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ సదాశివపేటలో రావూస్ స్కూల్‌కి సీబీఎస్ఈ అనుమతి లేదని ఆరోపించారు. ప్రమాదకర పరిస్థితుల్లో పాఠశాల నడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మండల విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేసినా డీఈఓ ఆదేశిస్తేనే చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి తగిన చర్యలు తీసుకోవాలని లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

అట్రాసిటీ కేసుల్లో సత్వర న్యాయం జరగాలి

ఎస్పీ రమణ కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ రమణకుమార్

సంగారెడ్డి టౌన్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ రమణ కుమార్ అన్నారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి అదనపు కలెక్టర్ వీరారెడ్డి హాజరై అట్రాసిటీ కేసుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం జరిగేందుకు పకడ్బందీగా దర్యాప్తు జరిపి పూర్తి ఆధారాలతో సకాలంలో చార్జి షీట్ ఫైల్ చేయాలన్నారు. బాధితులకు ప్రభుత్వం తరఫున అందించాల్సిన ఆర్థిక సహాయం త్వరగా అందేలా చూడాలని డీఆర్‌ఓకు, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల దర్యాప్తు త్వరగా పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీలకు సూచించారు. ప్రతీనెల సివిల్ రైట్స్ డే నిర్వహించేలా చూడాలని రెవెన్యూ డివిజనల్ అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో లాంగ్ పెండింగ్ ఏమీ లేవన్నారు. 2021–22లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి 46 కేసులలో బాధితులకు రూ.59.84 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ డీడీ అఖిలేష్ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి జగదీశ్, డీఎస్పీలు, ఆర్డీఓలు, డీటీడబ్ల్యూఓ ఫిరంగి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, కలెక్టరేట్ సూపరింటెండెంట్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కె.ఇమ్మయ్య, బి.రామకృష్ణ, పి.దుర్గాప్రసాద్, ఎం.చంద్రశేఖర్, రాథోడ్ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ యాక్ట్ అమలు

సంగారెడ్డి మున్సిపాలిటీ: జిల్లాలో నెలపాటు పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ రమణకుమార్ శుక్రవారం తెలిపారు. శాంతి భద్రతలను దృష్ట్యా జూలై 1వ తేదీ నుంచి 31 వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. పోలీసుల ముందస్తు అనుమతి లేనిదే ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. నిబంధనలు పాటించకుంటే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డుకు గేట్

అమీన్‌పూర్ భరత్‌నగర్‌లో 33 ఫీట్ల రోడ్డు మూసివేత

బల్దియా కీలక ప్రజాప్రతినిధి వ్యవహారం

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: అమీన్‌పూర్‌లో భూకబ్జాదారులు బరితెగిస్తున్నారు. ఏకంగా ఓ అడుగు ముందుకేసి ప్రజలు రాకపోకలు సాగించే రోడ్డునే కబ్జా చేశారు. అటువైపు ఎవరూ వెళ్లకుండా ప్రహరీ నిర్మించి గేటు పెట్టేశారు. ఈ కబ్జాకు పాల్పడింది అధికార బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కీలక ప్రజాప్రతినిధి కావడంతో జిల్లా అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. అమీన్‌పూర్‌లోని భరత్‌నగర్ కాలనీలో ఓ వెంచర్ ఏర్పాటు చేశారు. ఈ వెంచర్‌లో 33 ఫీట్ల రోడ్డును అమీన్‌పూర్ మున్సిపాలిటీకి చెందిన ఓ కీలక ప్రజాప్రతినిధి కబ్జా చేశాడు. రోడ్డుకు ఓ వైపు ప్రహరీ నిర్మించి మూసివేశారు. మరోవైపు కూడా ప్రహరీ నిర్మించి గేటు పెట్టేశాడు. దీంతో భరత్‌నగర్ కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలుపడుతున్నారు. ఈ రోడ్డు మూసివేయడంతో స్థానికులు, వాహనదారులు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డుకు ఓవైపు తన ఇల్లు, మరోవైపు వాణిజ్య పరమైన స్థిరాస్తి ఉంది. తనను అడిగేవారే లేడన్న ధీమాతో ఈ రోడ్డును మూసివేశాడు.

హైకోర్టుకు సామాజిక కార్యకర్త

పటాన్‌చెరుకు చెందిన సామాజిక కార్యకర్త వి.రవికృష్ణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పిటీషన్‌ను స్వీకరించిన హైకోర్టు ఈ కబ్జాపై విచారణ చేపట్టాలని, నాలుగువారాల్లో చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగానికి హైకోర్టు ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. బీఆర్‌ఎస్ నేత కావడంతో అధికారులు చర్యలు తీసుకుంటారా? లేదా? వదిలేస్తారా? వేచి చూడాల్సిందే. అధికారులు పట్టించుకోకపోవడం వల్లే తాను న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందని రవికృష్ణ తెలిపారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు

రోడ్డు కబ్జా వ్యవహారంపై స్థానికులు పలుమార్లు అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే, మున్సిపల్ ప్రజాప్రతినిధే ఈ కబ్జా చేయడంతో మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఈ అక్రమాలపై రెండు నెలల క్రితం కలెక్టరేట్‌లోనూ ఫిర్యాదు చేశారు. మరోవైపు మున్సిపల్ పరిపాలనశాఖ డైరెక్టర్, హెచ్ఎండీఏ కమిషనర్, హెచ్ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికీ ఫిర్యాదులు వెళ్లాయి. ఈ ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు కనీసం పట్టించుకోలేదు.



భరత్‌నగర్ కాలనీలోని రోడ్డులో ఏర్పాటుచేసిన గేటు

షోకాజ్ నోటీసులు జారీ చేశాం: సుజాత, మున్సిపల్ కమిషనర్

హైకోర్టు ఆదేశాల మేరకు భరత్‌నగర్‌లో రోడ్డు కబ్జా చేసిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశాం . రోడ్డు కబ్జా అయ్యిందా? లేదా? అనేది తెలియదు. అక్కడికి వెళ్లి చూశాక చెబుతాం. హైకోర్టు ఆశ్రయించిన వారికి కూడా నోటీసులు జారీ చేశాం.

క్లుప్తంగా

ఇంటి బయట చెత్త వేసిన వ్యక్తికి జరిమానా



జరిమానా రశీదు ఇస్తున్న మున్సిపల్ సిబ్బంది

సిద్దిపేటకమాన్: స్వచ్ఛ సిద్దిపేటలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు ఇందిరమ్మ కాలనీలో ఓ వ్యక్తి ఇంటి బయట చెత్త వేసినందుకు గాను మున్సిపాలిటీ సిబ్బంది అతడికి శుక్రవారం జరిమానా విధించారు. మున్సిపాలిటీ వాహనానికి మాత్రమే తడి, పొడి, హానికర చెత్తను వేరుచేసి ఇవ్వాలని కౌన్సిలర్ బర్ల మల్లిఖార్జున్ సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు జవాన్ మల్లేశం, మధు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటజోన్‌లో

సిద్దిపేటజోన్: మున్సిపల్ నిబంధనలు అతిక్రమించి రోడ్డుపై చెత్త వేసిన వ్యక్తికి మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. గురువారం అర్ధరాత్రి ఇందిరమ్మ కాలనీ చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనం మీద చెత్త సంచులు తెచ్చి పట్టణ శివారులో వేశాడు. సీసీ కెమెరాల ద్వారా గుర్తించిన మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత అతనికి జరిమానా విధించారు.

రోడ్డుపై వ్యక్తి హల్‌చల్



రోడ్డుపై అడ్డంగా పడుకున్న వెంకటేశ్‌ను పక్కకు తీసుకెళ్తున్న స్థానికులు

తూప్రాన్: రోడ్డుపై వ్యక్తి హల్‌చల్ చేసిన సంఘటన పట్టణ కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..ఆర్మూర్‌కు చెందిన వెంకటేశ్ గత కొన్నేళ్లుగా తూప్రాన్ మండలం వెంకటాయిపల్లిలో నివాసం ఉంటున్నాడు. కాళేశ్వరం సారంగం కాలువ పనుల్లో కూలీగా పని చేస్తున్నాడు. తూప్రాన్ పట్టణ కేంద్రంలో ఇటీవల డబుల్ బెడ్రూం ఇళ్లను తన తోటి కూలీలకు ఇచ్చిన అధికారులు తనకు ఇల్లు కేటాయించలేదని పట్టణంలోని ప్రధాన రహదారిపై పడుకొని హల్‌చల్ చేశాడు. దీంతో బస్సులు, వాహనాలు అరగంటపాటు నిలిచిపోయాయి. అనంతరం స్థానికులు రోడ్డుపై నుంచి బయటకు తీసుకొచ్చి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు అతణ్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మొబిలైజేషన్ కోఆర్డినేటర్‌గా సురేశ్ షెట్కార్

నారాయణఖేడ్: ఖమ్మంలో జూలై 2న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పాల్గొనే తెలంగాణ జనగర్జన సభ జనసమీకరణకు మొబిలైజేషన్ కోఆర్డినేటర్‌గా జహీరాబాద్ మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సురేశ్ షెట్కార్‌ను టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. అలాగే 15 నియోజకవర్గాలకు సమన్వయకర్తలను నియమించారు.

నగేశ్ ముదిరాజ్‌ను గెలిపించాలి

వట్‌పల్లి(అందోల్): జూలై 4న సంగారెడ్డి జిల్లా మత్స్య సహకార సంఘం ఎన్నికల్లో నగేశ్ ముదిరాజ్‌ను మత్స్యకారులు గెలుపించాలని ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ కన్వీనర్ నాగభూషణం పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని ఆయా గ్రామాలలో మత్స్య సహకార సంఘం సభ్యులతో కలిసి నగేశ్ ప్రచారం చేశారు.

3న గురువందనం

నారాయణఖేడ్: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో జూలై 3న గురుపౌర్ణమిని పురస్కరించుకొని గురువందనం నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ బాధ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కాకడహారతి, మహాగణపతిపూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వవరించారు.

అతి వేగమే కారణమా!

- ఎక్కడపడితే అక్కడ వాహనాలు ఆపడం
- నిర్లక్ష్యంగా పెట్రోలింగ్ సిబ్బంది
- చర్యలు తీసుకోని అధికారులు



ప్రమాదంలో పాక్షికంగా దగ్ధమైన డీసీఎం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రామాయంపేట(మెదక్): జాతీయ రహదారిపై వాహనాలు ఎక్కడ పడితే అక్కడ నిలపడం, అతి వేగం ప్రాణాలమీదికొస్తోంది. శుక్రవారం తెల్లవారుజామున నార్సింగి మండలం కాస్లాపూర్‌వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదానికి అతివేగంతోపాటు రోడ్డు పక్కన డీసీఎం నిలపడమే కారణమని భావిస్తున్నారు. జాతీయ రహదారిపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపడానికి వీల్లేకుండా ప్రత్యేకంగా తూప్రాన్‌నుంచి రామాయంపేటవరకు పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు హైవే పెట్రోలింగ్ వాహనాన్ని ఏర్పాటుచేశారు. పెట్రోలింగ్ వాహనం తిరుగుతున్నా ఈ ప్రమాదం జరగడం గమనార్హం. ఈ వాహనం 24 గంటలపాటూ హైవేపై తిరుగుతూ పరిస్థితిని సమీక్షించాల్సి ఉంటుంది. టైర్ల లోడుతో నాగ్‌పూర్ వెళ్తున్న డీసీఎం ముందు టైరు పంక్చర్ కావడంతో డ్రైవర్ రోడ్డు పక్కనే ఆపాడు. అక్కడ చిన్న మలుపుతోపాటు రోడ్డు కొంతమేర ఇరుకుగా ఉండటం ప్రమాదానికి కారణమని తెలుస్తుంది. కంటేయినర్ లారీ డ్రైవర్ దగ్గరగా వచ్చేవరకు ముందున్న డీసీఎంను పరిశీలించకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది. కంటేయినర్ డ్రైవర్ బ్రేకులు వేసే అవకాశం లేకండా నేరుగా వెనుకనుంచి డీసీఎంను ఢీకొట్టాడు. వేగం తీవ్రతకు కంటేయినర్ ముందు బాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వాహనాన్ని నడుపుతున్న డ్రైవర్ నాగరాజు (27) తోపాటు అదనపు డ్రైవర్ బస్వరాజ్ (30) నిమిషాల వ్యవధిలోనే క్యాబిన్‌లోనే సజీవ దహనమయ్యారు. మృతులిద్దరూ కర్నాటక రాష్ట్రానికి చెందినవారు. కాగా కంటేయినర్‌లోని ఎలక్ట్రానిక్ పరికరాలతోపాటు ఏసీలు, ఫ్రీజ్‌లు, ఇతర వస్తువులు మంటలకు ఆహుతయ్యాయి.

టైర్లలోడుతో ఉన్న డీసీఎంకు సైతం మంటలు వ్యాపించగా, పోలీసులు సకాలంలో స్పందించి మంటలను ఆర్పివేశారు. ఈ సంఘనటలో రోడ్డుపై సుమారు అరగంటకుపైగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు ప్రమాదం జరిగిన వైపు రోడ్డును క్లోజ్‌చేసి రెండో వైపు వాహనాలను పంపించారు. రామాయంపేట, తూప్రాన్ సీఐలు లక్ష్మీబాబు, శ్రీధర్ సంఘటనాస్థలాన్ని సందర్శించారు.

పల్వంచలో కార్డన్ సెర్చ్



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

టేక్మాల్(మెదక్): పల్వంచ గ్రామంలో అల్లాదుర్గం సీఐజార్జ్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. నలుగురు ఎస్‌ఐలతో నాలుగు బృందాలుగా విడిపోయి గ్రామంలో వాహనాలను తనిఖీ చేశారు. సుమారు 90 వరకు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని పలు సూచనలు చేసి వారికి అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ..గ్రామంలో శాంతి భద్రతలకు ప్రతీ ఒక్కరు సహకరించాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ వాహనానికి సరైన పత్రాలు ఉండాలని, ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టేక్మాల్ ఎస్‌ఐ రమేష్, అల్లాదుర్గం ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి, రేగోడ్ ఎస్‌ఐ సత్యనారాయణ, పెద్దశంకరంపేట ఎస్‌ఐ బాలరాజు, సర్పంచ్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

2న సత్యసాయి గురుపూజ

నారాయణఖేడ్: స్థానిక కట్టమైసమ్మ ఆలయ సమీపంలోని శ్రీసత్యసాయి సేవాసదన్‌లో జూలై 2న ఆదివారం ఉదయం 9 గంటలకు ఆర్‌ఎస్‌ఎస్ ఖేడ్ నగరశాఖ ఆధ్వర్యంలో గురుపూజ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఖేడ్ ఆర్‌ఎస్‌ఎస్ ఖండకార్యవాహ వడిత్య ప్రసాద్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఖేడ్ సాయిసంజీవని ఆస్పత్రి నిర్వాహకుడు డా.పి. జగన్‌మోహన్, వక్తగా జిల్లా సంఘచాలక్ చక్రవర్తుల రామకృష్ణ హాజరవుతారని పేర్కొన్నారు.

మనస్తాపంతో యాసిడ్ తాగిన గురుకుల పాఠశాల విద్యార్థిని

సకాలంలో చికిత్స చేయించడంతో తప్పిన ప్రాణాపాయం

సిద్దిపేటఅర్బన్: ఇంటి వద్ద ఉండి చదువుకోవడానికి తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో మనస్తాపానికి గురైన విద్యార్థిని హాస్టల్ టాయిలెట్‌లో వినియోగించే యాసిడ్ సేవించి అస్వస్థతకు గురైంది. ఈ సంఘటన సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన విద్యార్థిని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. ఇంటికి దూరంగా కాకుండా తల్లిదండ్రులతో ఉంటూ చదువుకుంటానని కొంతకాలంగా తల్లిదండ్రులతో వాదిస్తూ వస్తోంది. ఎంత చెప్పినా వాళ్లు వినకుండా గురుకుల పాఠశాలలో చేర్పించారు. దీంతో విద్యార్థిని తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం ఉదయం యాసిడ్ సేవించింది. దీన్ని గమనించిన సహచర విద్యార్థులు ప్రిన్సిపాల్‌కు సమాచారం చేరవేశారు. వారు సకాలంలో స్పందించడంతో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి పంపించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌కు విశేష స్పందన



డ్రైవింగ్ లైసెన్స్ కోసం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద దరఖాస్తులు చేసుకుంటున్న యువకులు

దుబ్బాకటౌన్: దుబ్బాక నియోజకవర్గంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు తన స్వంత ఖర్చులతో లైసెన్స్‌లు ఇప్పిస్తానని ప్రకటించడంతో పెద్ద ఎత్తున యువత దరఖాస్తులు చేసుకుంటున్నారు. దుబ్బాక పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద త్తున యువకులు తరలిరావడంతో ఆ ప్రాంతమంతా సందడిగా కనిపించింది. గురువారం నుంచి ప్రారంభంకాగా శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు 1639 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లకు దరఖాస్తులు చేసుకోవడం విశేషం. జూలై 5 వరకు అవకాశం ఉండడంతో ఇంకా ఎక్కువ మొత్తంలో దరఖాస్తులు వచ్చే అవకాశం నెలకొంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉందని క్యాంపు కార్యాలయం కార్యదర్శి కరుణాకర్ యాదవ్ తెలిపారు.

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

15 మందికి గాయాలు

కోహీర్(జహీరాబాద్): కోహీర్ పట్టణంలోని పాతబస్టాండ్ చౌరస్తా వద్ద శుక్రవారం సాయంత్రం రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో 15 మంది గాయపడ్డారు. చిన్నపిల్లల మధ్య జరిగిన గొడవలో పెద్దలు కల్పించుకొని లాఠీలతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. స్థానికులు, పోలీసులు కల్పించుకొని ఇరువర్గాలను శాంతింప జేశారు. తిరిగి ఘర్షణలు చెలరేగకుండా కోహీర్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో పాతబస్టాండ్ కూడలిలో దుకాణాలను మూసివేశారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉంది. జహీరాబాద్ సీఐ తోట భూపతి హుటహుటిన కోహీర్ తరలివచ్చి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం కోహీర్ పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాలతో సంప్రదింపులు జరిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకొన్నారు. గాయపడిన వారిని కోహీర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటనకు బాధ్యులపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితుల మధ్య ఘర్షణ

ఒకరికి తీవ్రగాయాలు

జిన్నారం(పటాన్‌చెరు): స్నేహితుల మధ్య మద్యం విషయంలో గొడవ జరిగింది. బొల్లారం సీఐ నయాముద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం..ఆయా పరిశ్రమల్లో విధులు నిర్వహిస్తున్న పలువురు స్నేహితులు గురువారం మద్యం సేవించేందుకు గడ్డపోతారంలోని కేసీఆర్ కాలనీ వద్ద ఏకమయ్యారు. మద్యం తీసుకువచ్చేవిషయంలో ఇరువురి మధ్య గొడవ మొదలైంది. బిహార్‌కు చెందిన ఆలం స్నేహితుడైన సమీర్‌పై దాడి చేశాడు. దీంతో సమీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమీర్ అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తల్లిపై దాడిచేసిన కుమారుడి రిమాండ్

తొగుట(దుబ్బాక): మద్యం మత్తులో కన్న తల్లిపై కత్తితో దాడిచేసిన వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్ చేశారు. ఎస్‌ఐ కర్ణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన బండారి వెంకటలక్ష్మీ కుమారుడు బాలకృష్ణ ఈ నెల 20న రాత్రి డబ్బుల కోసం కత్తితో తల్లిపై దాడిచేసి గాయపర్చాడు. ఈ సంఘటనలో తల్లి తీవ్రంగా గాయపడిందన్నారు. నాటి నుంచి నిందితుడు పరారీలో ఉన్నాడని తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో ఈ నెల 29న రాత్రి లింగాపూర్‌కు వెళ్తుండగా పోలీసులు బాలకృష్ణను అదుపులోకి తీసుకున్నారు.

హత్య చేసి.. ఆపై పెట్రోల్ పోసి..

తుంకుంట గ్రామ శివారులో ఘటన



కాలిన మృత దేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రఘు, సీఐ భూపతి

జహీరాబాద్ టౌన్: మహిళను హత్య చేసి పెట్రోల్ పోసి దహనం చేసిన సంఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ సమీపంలోని తుంకుంట గ్రామ శివారులో చోటు చేసుకుంది. జహీరాబాద్ టౌన్ సీఐ భూపతి తెలిపిన వివరాల ప్రకారం..గుర్తుతెలియని మహిళను ఎక్కడో హత్యచేసి జాతీయ రహదారి 65కు సమీపంలోని తుంకుంట వెళ్లే దారిలో రోడ్డు పక్కన మొగులయ్య పొలం వద్ద గురువారం రాత్రి పెట్రోల్ పోసి తగులబెట్టారు. ముఖంపై పెట్రోల్ పోసి కాల్చడంతో గుర్తుపట్టని విధంగా ముఖం కాలిపోయింది. మృతురాలి వయస్సు సుమారు 22 సంవత్సరాలు ఉంటుంది. విషయం తెలుసుకున్న జహీరాబాద్ డీఎస్పీ రఘు, సీఐ భూపతి, రూరల్ ఎస్‌ఐ కాంతరావులు సంఘటన స్థలాన్ని సందర్శించారు. గర్తుతెలియని మహిళ మృతదేహాన్ని కర్నాటక వాసిదిగా పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. తుంకుంట సర్పంచ్ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మల్లన్న ఆలయ ఉద్యోగి మృతి



జాలిగామ నరేందర్ (ఫైల్)

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో వంట పనిచేస్తున్న జాలిగామ నరేందర్(50) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..మృతుడు 15 సంవత్సరాలుగా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో నిత్యాన్నదాన సత్రంలో పనిచేసేవాడు. ఈ సందర్భంగా మృతుని కుటుంబానికి తక్షణసాయంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి రూ.10 వేలు అందజేశారు. అనంతరం ఆలయ ఈవో బాలాజీ, చైర్మన్ గీస భిక్షపతి అధికారులు, ఉద్యోగులు, అర్చకులు అతని కుటుంబాన్ని పరామర్శించారు.

ఆత్మహత్యకు ప్రేరేపించిన వ్యక్తి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితుడు మోహన్

రాయికోడ్(అందోల్): ఆత్మహత్యకు ప్రేరేపించిన వ్యక్తిని అరెస్ట్ చేసిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేష్, ఎస్‌ఐ వెంకట్‌రెడ్డిలు తెలిపిన వివరాల ప్రకారం..నాగస్‌పల్లి గ్రామానికి చెందిన విజయ, తన నాలుగేళ్ల కూతురు గౌరిని తీసుకొని ఈ నెల 27వ తేదీన సిరూర్ శివారులోని మంజీర నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. విజయ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా నాగస్‌పల్లి గ్రామానికి చెందిన బి మోహన్ విజయతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఆమెను తీవ్రంగా వేధించినట్లు తేలిందన్నారు. ఈ క్రమంలో ఆమె ఆత్మహత్యకు పూనుకుందన్నారు. విచరణఅనంతరం నాగస్‌పల్లిలో ఉన్న నిందితుణ్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

క్రెడిట్ కార్డు అప్‌డేట్ పేరుతో సైబర్ మోసం

సిద్దిపేటకమాన్: క్రెడిట్ కార్డ్ అప్‌డేట్ చేయాలంటూ వచ్చిన ఫోన్ కాల్‌కు స్పందించి డబ్బులు పోగొట్టుకున్న సంఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సీపీ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తినుంచి ఫోన్ వచ్చింది. క్రెడిట్ కార్డ్ బ్లాక్ అవుతుందని అప్‌డేట్ చేయాలని అందుకుగాను పాన్ కార్డు, ఇతర వివరాలు నమోదు చేయాలని ఓ లింకు పంపించాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తి చెప్పిన విధంగా లింకును ఓపెన్ చేసి పాన్ కార్డు వివరాలు, క్రెడిట్ కార్డు వివరాలను, సీవీవీ నెంబర్ నమోదు చేశాడు. వెంటనే అతడి ఖాతా నుంచి రూ.1,13,600లు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. అనుమానంతో గుర్తు తెలియని వ్యక్తికి ఫోన్ చేయగా అతను స్పందించలేదు. దీంతో చేసేదేమి లేక తను మోసపోయినట్టుగా గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

మరో సంఘటనలో..

తక్కువ మొత్తంలో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభం వస్తుందంటూ ఆశ చూపి సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి ఇన్‌స్టాగామ్‌లో పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తంలో డబ్బులు వస్తాయనే ప్రకటన చూసి అందులో ఉన్న ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేశాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తి సూచించిన విధంగా ఆన్‌లైన్‌లో రూ.10వేలు పెట్టుబడి పెట్టాడు. తర్వాత ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా ఎలాంటి స్పందన లేకపోవడంతో సైబర్ మోసం జరిగినట్లు గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు

తూప్రాన్: మున్సిపల్ చైర్మన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ కుమార్ శుక్రవారం పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..పట్టణ పరిధిలోని అల్లాపూర్ గ్రామానికి చెందిన స్వామి ఈ నెల 8న ప్రసార మాధ్యమాల్లో నోటికొచ్చింది మాట్లాడినట్లు వచ్చిన ఆరోపణలపై పట్టణానికి చెందిన మహేశ్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ ఘటనలో స్వామికి కొందరు మద్యం తాగించి మున్సిపల్ చైర్మన్‌పై ఇష్టానుసారంగా మాట్లాడించినట్లు నిందితుడు పేర్కొంటున్నాడు.

మూడు మోటర్లు, 59 పైపులు చోరీ



ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): గుర్తుతెలియని వ్యక్తులు బోరుబావుల నుంచి మోటర్లు, పైపులు, స్టాటర్ డబ్బాలు చోరీ చేశారు. కొత్తపేట, అల్లీపూర్ గ్రామాలకు చెందిన పలువురు రైతులకు సాగుకోసం అసైండ్ భూములను ప్రభుత్వం ఇచ్చింది. ఈ భూముల్లో రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారు. తమ బోరుబావుల నుంచి మోటర్లు, పైపులు, స్టాటర్ డబ్బాలు గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు రైతులు తెలిపారు. మానేగల్ల సత్యనారాయణకు చెందిన 7 హెచ్‌పీ మోటర్లు, 22 పైపులు, స్టాటర్ డబ్బా, బొల్లు సాయిలుకు సంబంధించి 5 హెచ్‌పీ మోటరు, 15 పైపులు, స్టాటర్ డబ్బా, సాదు మహేష్‌కు చెందిన 5 హెచ్‌పీ మోటరుతో పాటు 22 పైపులు, స్టాటర్ డబ్బా చోరీకి గురయ్యాయని వారు స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

ASTROLOGY

ఉచితంగా జ్యోతిష్యం చెప్పబడును, మీ రెండు హస్తాలను చూసి వ్యాపారం, లాభనష్టాలు, దాంపత్య సమస్య, సంతానం, స్త్రీ ప్రేమ, వ్యవసాయం, కోర్టు తగాదాలు జటిలమైనవి. ఫోన్: 9108855194 [HA-1001880]

WANTED

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ:18K. Ph: 9640258899, 9640468899 [H-189303]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి.. మరొకరికి గాయాలు

వేర్వేరు ఘటనల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందారు. మరొకరికి గాయాలయ్యాయి.



మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య అనిత

బెజ్జంకి(సిద్దిపేట): గాగిల్లాపూర్ సమీపంలోని రాజీవ్ రహదారిపైన శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడని బెజ్జంకి పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..రాజగోపాల్‌పేటకు చెందిన రాగుల శ్రీనివాస్ (43) భార్య అనితతో కలిసి కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని వచ్చునూరులోని కూతురు స్వప్న ఇంటికి గురువారం ద్విచక్ర వాహనం పైన వెళ్లారు. అక్కడ జరిగిన మనుమరాలు అన్నప్రాసన కార్యక్రమంలో పాల్గొని తిరిగొస్తున్న క్రమంలో శుక్రవారం గాగిల్లాపూర్ శివారులోని రాజీవ్ రహదారిపైన చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతనికి బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ కనుకయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీ కొని..



ప్రమాదంలో గాయపడ్డ కిషన్

కొల్చారం(నర్సాపూర్): గుర్తుతెలియని వాహనం ఢీ కొని వ్యక్తికి గాయాలైన సంఘటన దుంపలకుంట చౌరస్తా మెదక్–జోగిపేట ప్రధాన రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు కాళ్ల కిషన్ ప్రధాన రహదారికి కొద్ది దూరంలో ఉన్న తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్తున్నక్రమంలో వెనుక నుంచి గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీ కొట్టినట్లు తెలిపారు. దీంతో కిషన్‌కు తల, ఇతర భాగాల్లో గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అతణ్ని మెదక్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

జల్సాలకు అలవాటు పడి చోరీలు

8 బైక్‌లు, ఆటో, ల్యాప్‌టాప్ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు



నిందితుడు ప్రకాశ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జల్సాలకు అలవాటు పడి బైక్‌లను దొంగిలిస్తున్న ఓ యువకుడిని రామచంద్రాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ నరేందర్ రెడ్డి కథనం ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలో గురువారం రాత్రి పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీకి చెందిన చిన్న ప్రకాశ్ అలియాస్ చింటూ బైక్‌పై వస్తుండగా అనుమానంతో అతని వాహనాన్ని ఆపి సంబంధిత పత్రాలను చూపించాలని కోరారు. దాంతో చిన్న ప్రకాష్ సరైన పత్రాలు చూపించకపోవడంతో పాటు పొంతనలేని సమాధానం చెప్పడంతో పోలీసులకు అనుమానం వచ్చి అదుపులోకి తీసుకొని విచారించారు. జల్సాల కోసం మోటార్‌సైకిల్ చోరీ చేస్తున్నట్లు విచారణలో ఒప్పుకున్నాడని పోలీసులు పేర్కొన్నారు. ఈ సంఘటనలో నిందితుడు దొంగిలించిన 8 బైక్‌లు, ఆటో, ల్యాప్‌టాప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా చిన్న ప్రకాష్‌పై సైబరాబాద్‌లో 8కేసులు, సదాశివపేట్‌లో 2కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతణ్ని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసును త్వరగా ఛేదించినందుకు ఏసీపీ నరసింహారావు ఇన్‌స్పెక్టర్ నరేందర్ రెడ్డి, ఎస్‌ఐ శశికాంత్ రెడ్డి, క్రైం సిబ్బందిని అభినందించారు.